# శ్రీరారామం

'దోమలకు మాత్రమే ఆటపట్టు అన్న ఊరిమధ్య తేనెపట్టు కనుగోగలిగినప్పుడు మరేం సాధ్యం లేదు?'

రచయిత :
## కవికొండల వేంకటరావు, బి.యే., బి.యల్.

సంస్కృతంలో 'శ్రీరారామం!'. తెలుగులో 'పాలకొలను!' రెండింటినీ సమన్వయించి ఒకానొక అర్థం స్ఫురించే ప్రత్యక్ష ప్రమాణ పదార్థంగా నిరూపించుకుంటే 'తోటలో కోనేరు'. తోట బత్తాయితోట. కోనేరు మంచినీళ్ళ కోనేరు. తోటలో కోనేటి వొడ్డునే కూర్చుని చెట్ల సందుగుండా పరకాయిస్తూ వున్నాను. పాలకొల్లు వూళ్లోకి వెల్లడం అంటే భయం. దోమలు. ఊరినిండా దోమలే అని వాడుక.

తోటలో కోనేటి వొడ్డునే కూర్చుని చెట్లసందుగుండా పరకాయించగా, పరకాయించగా నాకేదో గోచరించింది. 'అదేమిటి? అనిఅడిగాను తోటమాలిని.' 'పాలకొల్లు గోపురం' అన్నాడు అతడు. 'చూడతగిందేనా?' అన్నాను. 'చూడతగింది, ఎక్కతగిందికూడా!' అన్నాడు గుర్రాన్నిగురించి చెప్పినట్లు. కాని వూళ్ళోకివెళ్ళడం అంటే భయం! దోమలు. ఊరినిండా దోమలే అని వాడుక.

కాబట్టి మంచి ఎండవేళ బయలుదేరాను. నానమ్మకం, ఆవేళప్పుడు దోమలన్నీ మలమలమాడి వుంటాయని, మనల్ని కుట్టవని, వీధంట స్వేచ్ఛగానడచి గోపురం సాంతంగా చూడవచ్చునని.

తెనుగునాటి గోపురాల్లో పాలకొల్లు గోపురమే అత్యున్నతమైనదిగా తోస్తుంది. మఱి గోపురంమీద కూర్చబడ్డ బొమ్మల సంఖ్యలు చాలవఱకు నాట్యాభినయంతో కూడుకొన్న స్త్రీ జాతివే. విశేషించి కనబడేది మహిషాసుర మర్దన నృత్యం. ఒక్క అంగుళం మేరకూడా వృధాకాకుండా గోపురం వెలుపలి భాగం అంతటా అలుముకున్నాయి విగ్రహాలు! అలా చేతులుచాచి, ఇలా కాళ్లుచాచి, అలా మెడమోసి, ద్వయద్వయాలుగా కుచాలుకాసి! మోహం అనేదే సున్నం గానుగులో పోసి ఆడి ఆసున్నంతో మోపికట్టారా ఆ గోపురం అన్నట్లు తోచకమానదు, ఆ బొమ్మలన్నింటినీ చూచేవాళ్ళకు. కాని అమాయకపు చిన్నపిల్లవాడు చూచే చూపుతో చూడాలి అన్నారు కొందఱు కళావేత్తలు. వెంటనే నాకేమిటిగా తోచిందిఅంటే, చిన్నపిల్లవాని చూపే కాకుండా, చిన్నపిల్లవాని చేష్టలుకూడా అలవరుచుకొని ఆయా అభినయరూపాల చేతులమీదుగా, వేళ్ళమీదుగా నాచిరుగజ్జెల కాళ్ళ నానించుకుంటూ శిశువునై ఎగప్రాకి తుదీ అంతస్థుమీద వుండిపోవాలనిపించింది,

పదకొండంతస్థులిది ఆ గోపురం! ఒకదాని ద్వారంకంటె ఒకదాని ద్వారం చిన్నదై ఏదో లోకానికి గొంపోయేటట్టు తట్టింది. కాని నాకోరిక తీరని శైశవపు గోరికల్లో ఒక్కటిగా అయిపోయింది. లోతట్టు బాహాటమైన మెట్లబాటవుందంటే గోపురం లోతట్టుకు దృష్టి మరల్చి ఆమార్గం పట్టాం. చీకటిమయం, గబ్బిలాల కంపూను. ఒకొక్క అంతస్థుకెక్కి తిలకించబోతే - తలుపులు తెరచి బాహ్యప్రపంచం మీదికి దృష్టిపారిస్తే - ఎంతోదవ్వుకు ప్రకృతి కనిపించడమనేదే లేకపోతే మాకు సాంత్వనం లేదనుకోండి! తుదకు జుగుప్సకంటె ఉత్సాహం ఎక్కువైందన్నట్టు విడిచిపెట్టకుండా చివరి అంతస్థుకంటా ఎక్కిపోయినాం.

ఎక్కితే, ఆ అంతస్థు లోపలకు మనం దూరి వెళ్ళినా సందులేనట్టు అయిపోయింది. ఆ అంతస్థును పట్టి పెద్ద చేటంత తేనెపట్టు!!! దోమలకు మాత్రమే ఆటపట్టుఅన్న ఊరిమధ్య తేనెపట్టు కనుగోగలిగినప్పుడు మరేం సాధ్యం కాదు? 'శివుడు మనకెందుకు ప్రత్యక్షం గాడు?' అన్న ఆస్తికభావం మహత్తరంగా ఉరవైంది.

గోపురందిగి గుళ్ళోకివెళ్ళి తిలకించాను. లింగస్వరూపం నల్లరాతిని చెక్కబడి సర్వసాధారణపు ఎత్తునే నిరూపింపబడ్డా, నంది చెవులమీదుగా గనుగొన్నప్పుడు కుందనంలా మెఱిసిపోయింది కోటిపడగెత్తుకు.

పాలకొలను సుక్షాని సమాశ్రయించుకున్నవాడై కుబేరుడు, తన అలకాపట్నాన్ని బడయనేరనటువంటి శివుని చెలిమి వడసి, విడిచిపెట్టకుండావున్న తావుకాదు కదా అది నేటికీన్నీ ?